మంగళవారం 21-01-2025

# ముందడుగు దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 548 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

### సంజయ్ రాయ్
## శిక్ష పట్ల అసంతృప్తి

- సీఎం మమతా బెనర్జీ స్పందన


2 లో

### ఆర్‌జీకార్ దోషి
## సంజయ్ రాయ్‌కి జీవితఖైదు

- కోల్‌కతా సీల్దా కోర్టు శిక్ష ఖరారు
- మరణశిక్ష విధించాలంటూ తల్లిదండ్రులు డిమాండ్


2 లో

### భారత ఆర్మీ
## సరికొత్త రికార్డు

కదిలే మోటార్ బైక్‌లపై

హ్యూమన్ పిరమిడ్


3 లో

### భక్తజనసంద్రంగా మారిన
## ప్రయాగ్‌రాజ్

- 12 లక్షల మందికి తాత్కాలిక ఉపాధి
- 40కోట్ల మందికిపైగా భక్తులు వస్తారని అంచనా

3 లో


### తెలంగాణలో
## బీర్ల సరఫరాను పునరుద్ధరణ

యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ ప్రకటన

2 లో


### హారన్ మోత మోగించిన
## బస్సు డ్రైవర్లు..

ట్రాఫిక్ పోలీస్ వినూత్న శిక్ష



4 లో

### ప్రియుడిని చంపిన
## మహిళకు ఉరిశిక్ష

కేరళ కోర్టు సంచలన తీర్పు


2 లో



3 లో

### శబరిమల అయ్యప్ప
## ఆలయం మూసివేత

అయ్యప్పను దర్శించుకున్న భక్తులు 53లక్షలు

41రోజుల పాటు కొనసాగిన పూజలు

ముందడుగు
మంగళవారం 21-01-2025 హైదరాబాద్

## ఆర్‌జీకార్ దోషి సంజయ్ రాయ్‌కి జీవితఖైదు

ముందడుగు కోల్‌కతా

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పశ్చిమ బెంగాల్ కోల్‌కతా ఆర్‌జీకార్ వైద్య కళాశాల ట్రెయినీ డాక్టర్‌పై లైంగిక దాడి, హత్య కేసులో కోల్‌కతా కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసులో అరెస్టయిన సంజయ్ రాయ్‌ను న్యాయస్థానం శనివారం దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా అతడికి కోల్‌కతాలోని సీల్దా కోర్టు శిక్ష ఖరారు చేసింది. దోషి సంజయ్ రాయ్‌కి జీవితఖైదు విధించింది. అతడికి రూ.50 వేలు జరిమానా కూడా విధించింది. అంతేకాదు బాధిత కుటుంబానికి రూ.17లక్షల పరిహారం ఇవ్వాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. అయితే, కోర్టు తీర్పుపై బాధిత కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దోషికి మరణశిక్ష విధించాలంటూ వైద్యురాలి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

2024 ఆగస్టు 9న కోల్‌కతాలోని ఆర్‌జీకార్ ఆసుపత్రిలో సెమినార్ రూమ్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం కాగా ఆర్‌జీకార్ దవాఖాన డాక్టర్లు, వైద్య విద్యార్థులు సుదీర్ఘకాలం ఆందోళనలు నిర్వహించారు. దీనిపై గత వారం విచారణ జరిపిన కోల్‌కతాలోని సీల్దా కోర్టు.. సంజయ్ రాయ్‌ని దోషిగా నిర్ధారించింది. ఈ మేరకు ఇవాళ దోషికి శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువరించింది.

## సంజయ్ రాయ్ శిక్ష పట్ల అసంతృప్తి

ముందడుగు పశ్చిమబెంగాల్

దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కోల్‌కతాలోని ఆర్జీకర్ అత్యాచారం కేసులో దోషి సంజయ్ రాయ్‌కు సీబీఐ కోర్టు జీవిత ఖైదు విధించింది. సీఎం మమతా బెనర్జీ దీనిపై స్పందించారు. సంజయ్ రాయ్‌కు కోర్టు విధించిన శిక్ష పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో ఆమె మాట్లాడారు. 'నేను సంతృప్తి చెందలేదు. మనమంతా మరణశిక్షను డిమాండ్ చేశాం. కానీ కోర్టు మరణించే వరకు జీవిత ఖైదు విధించింది' అని అన్నారు.

గత ఏడాది ఆగస్ట్ 9న ఆర్జీ కర్ ఆసుపత్రిలో రాత్రి విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం కేసు దర్యాప్తును కోల్‌కతా పోలీసుల నుంచి బలవంతంగా తీసుకున్నారని మమతా బెనర్జీ ఆరోపించారు. ఒకవేళ కోల్‌కతా పోలీసులు ఈ కేసు దర్యాప్తును కొనసాగించి ఉంటే నిందితుడికి మరణశిక్ష నిర్ధారించేవారని అన్నారు. మరోవైపు సీబీఐ దర్యాప్తును మమతా బెనర్జీ ప్రశ్నించారు. 'వారు (సీబీఐ) దర్యాప్తు ఎలా నిర్వహించారో మాకు తెలియదు. రాష్ట్ర పోలీసులు దర్యాప్తు చేసిన ఇలాంటి అనేక కేసుల్లో మరణశిక్ష విధించారు. ఈ శిక్ష పట్ల నేను సంతృప్తి చెందలేదు. మరణశిక్షను డిమాండ్ చేస్తున్నాం. మాకు న్యాయం కావాలి' అని అన్నారు.

## తెలంగాణలో బీర్ల సరఫరాను పునరుద్ధరణ

ముందడుగు తెలంగాణ

తెలంగాణలో అతిపెద్ద బీర్ల తయారీ సంస్థ యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యూబీఎల్) సంస్థ సరఫరాను పునరుద్ధరించింది. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వ హామీతో బీర్ల సరఫరాను పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొంది. ధరల పెంపు, బకాయిలపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందని తెలిపింది.

గత రెండేళ్ల నుంచి రూ.702 కోట్ల బకాయిల్ని కార్పొరేషన్ విడుదల చేయకపోవడం, బీరు మూల ధరను సవరించాలని ఎన్ని సార్లు విన్నవించినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో బీర్ల సరఫరాను యూబీఎల్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో ఆరు బీర్ల తయారీ సంస్థలున్నా మార్కెట్లోకి వచ్చే వాటిలో 75 శాతం వాటా యూబీఎల్‌దే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడింది. దీంతో మద్యం ధరల పెంపు అంశంపై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆధ్వర్యంలో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ సిఫారసుల మేరకు నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో యూబీఎల్.. సరఫరాను పునరుద్ధరించింది.

## ప్రియుడిని చంపిన మహిళకు ఉరిశిక్ష

ముందడుగు కేరళ

ప్రియుడికి విషం ఇచ్చి చంపిన మహిళకు కోర్టు మరణశిక్ష విధించింది. కేరళకు చెందిన 23 ఏళ్ల షారన్ రాజ్, తమిళనాడుకు చెందిన 24 ఏళ్ల గ్రీష్మ ఒకే కాలేజీలో చదువుతూ ప్రేమించుకున్నారు. అయితే గ్రీష్మకు మరో వ్యక్తితో పెళ్లి సంబంధం కుదిరింది. దీంతో ప్రేమ సంబంధాన్ని వదులుకోమని రాజ్‌కు చెప్పింది. అతడు ఒప్పుకోకపోవడంతో హత్య చేయాలని నిర్ణయించింది. తొలుత జ్యూస్‌లో పారాసిటమాల్ మాత్రలు కలిపి రాజ్‌కు ఇచ్చింది. అయితే చేదుగా ఉండటంతో తాగేందుకు అతడు నిరాకరించాడు. 2022 అక్టోబరు 14న తమిళనాడులోని కన్యాకుమారి జిల్లా రామవర్మం చిరైలోని తన ఇంటి కి ప్రియుడు రాజ్‌ను గ్రీష్మ రప్పించింది. ఆయుర్వే ద టానిక్‌లో విషం కలిపి ఇచ్చింది. అది తాగిన రాజ్ తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యాడు. పలు అవయవాలు దెబ్బ తినడంతో 11 రోజుల తర్వాత అక్టోబర్ 25న మరణించాడు. అతడిపై విష ప్రయోగం జరిగినట్లు పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లో నిర్ధారణ అయ్యింది. మరోవైపు రాజ్‌ను హత్య చేసిన గ్రీష్మ, సహకరించిన ఆమె కుటుంబ సభ్యుల ను పోలీసులు అరెస్ట్ చేశారు. రెండేళ్లుగా ఈ కేసు పై విచారణ కోర్టులో కొనసాగింది.

జనవరి 17న తిరువనంతపురంలోని అదనపు జిల్లా సెషన్స్ కోర్టు గ్రీష్మను దోషిగా నిర్ధారించింది. సోమవారం శిక్షలు ఖరారు చేసింది. గ్రీష్మకు మరణశిక్ష విధించింది. ఆమెకు సహకరించి, ఆధారాలు ధ్వంసం చేసిన మేనమామ నిర్మల్ కుమార్‌కు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. అయితే గ్రీష్మ తల్లి సింధును నిర్దోషిగా కోర్టు విడుదల చేసింది.

ముందడుగు
మంగళవారం 21-01-2025 హైదరాబాద్

# శబరిమల అయ్యప్ప ఆలయం మూసివేత

ముందడుగు కేరళ

కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలో మండలపూజ, మకర విళక్కు వార్షిక పూజలు వైభవంగా ముగిశాయి. దీంతో సోమవారం ఉదయం ఆలయాన్ని మూసివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు అధికారులు వెల్లడించారు. పందలం రాజకుటుంబ ప్రతినిధి త్రికేత్తనాల్ రాజ రాజ వర్మ అయ్యప్ప దర్శనం చేసుకున్న తర్వాత సోమవారం ఉదయం 6.30 గంటలకు ఆలయాన్ని మూసివేశామని పేర్కొన్నారు. ఈ సీజన్‌లో 53 లక్షల మందికిపైగా భక్తులు అయ్యప్ప స్వామి వారిని దర్శించుకున్నారని తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. రెండు నెలల పాటు జరిగే మండల-మకర విళక్కు వార్షిక పూజల కోసం నవంబర్ 15న అయ్యప్ప ఆలయాన్ని పూజారులు తెరిచారు. మండల పూజ అనంతరం డిసెంబర్ 26న గుడిని మూసివేశారు. 41 రోజులపాటు సాగిన పూజల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. నాలుగు రోజుల విరామం తర్వాత డిసెంబర్ 30న సాయంత్రం 4 గంటలకు మళ్లీ ఆలయాన్ని తెరిచారు.

ఈ సీజన్‌లో అయ్యప్ప ఆలయానికి భక్తులు పోటెత్తారు. రోజుకు లక్షలాది మంది భక్తులు అయ్యప్పను దర్శించుకున్నారు. మొత్తం 53 లక్షల మందికిపైగా భక్తులు అయ్యప్ప దర్శనం చేసుకున్నట్లు టీడీపీ తెలిపింది.

## భారత ఆర్మీ సరికొత్త రికార్డు

ముందడుగు జాతీయం

భారత ఆర్మీకి చెందిన 'డేర్ డెవిల్స్' సరికొత్త రికార్డు నెలకొల్పింది. కదిలే మోటార్ బైక్‌లపై హ్యూమన్ పిరమిడ్‌తో వరల్డ్ రికార్డు నమోదు చేసింది. ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో డేర్‌డెవిల్స్ ఈ అసాధారణ ఘనతను సాధించింది. 20.4 అడుగుల ఎత్తులో నిర్వహించిన ఈ ఫీట్‌లో మొత్తం 40 మంది పాల్గొన్నారు.

7 మోటార్ వాహనాలపై నిలబడి కర్తవ్యపథ్‌లోని విజయ్‌చౌక్ నుంచి ఇండియా గేట్ వరకు 2 కిలోమీటర్ల మేర రైడ్ కొనసాగించారు. వీరిలో సిగ్నల్స్ కార్ప్స్ ఆర్మీ హెడ్ లెఫ్టినెంట్ జనరల్ కె.వి. కుమార్ కూడా ఉన్నారు. తాజా ఫీట్‌తో డేర్‌డెవిల్స్.. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో పాటు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇలా 33 ప్రపంచ రికార్డులను సాధించింది.

## ఉద్యోగం రాలేదని కుమారుడు ఆత్మహత్య..

### తట్టుకోలేక గుండెపోటుతో తల్లి మృతి

ముందడుగు మధ్యప్రదేశ్



చదువుకున్న ఉద్యోగం రాలేదని మనస్తాపంతో ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలిసి అతడి తల్లి గుండెపోటుతో మరణించింది. తల్లి, కుమారుడు మరణించిన సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఈ సంఘటన జరిగింది. 33 ఏళ్ల మనీష్ రాజ్‌పుత్ ప్రభుత్వ ఉద్యోగాల కోసం చాలా పరీక్షలు రాశాడు. ఏ ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఈ నేపథ్యంలో జనవరి 18న శనివారం రాత్రి వేళ ఇంట్లో విషం సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మనీష్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించారు. మనీష్ చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. అయితే కుమారుడి మరణవార్త తెలిసి అతడి తల్లి రాధా గుండెపోటుతో కుప్పకూలి చనిపోయింది. ఈ నేపథ్యంలో ఆ కుటుంబంలో విషాదం నెలకొన్నది. రాధా పెద్ద కుమారుడు అనిల్ ఈ విషయాన్ని పోలీసులకు తెలిపాడు. దీంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భక్తజనసంద్రంగా మారిన ప్రయాగ్‌రాజ్

ముందడుగు ఉత్తరప్రదేశ్



అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాతో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ కళకళలాడుతోంది. జనవరి 13న మొదలై ఫిబ్రవరి 26 వరకు మొత్తంగా 45 రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమానికి 40కోట్ల మందికిపైగా భక్తులు వచ్చి, పుణ్యస్నానాలు ఆచరించనున్నారని అంచనా.

ఈ స్థాయిలో భక్తజనసంద్రమైన ప్రయాగ్‌రాజ్.. లక్షలాదిమందికి ఉపాధి కల్పిస్తోంది. 12 లక్షల తాత్కాలిక ఉద్యోగాల సృష్టి జరిగిందని గ్లోబల్ టెక్నాలజీ అండ్ డిజిటల్ టాలెంట్ సొల్యూషన్స్ ప్రొవైడర్ ఎన్ఎల్‌బీ సర్వీసెస్ అంచనావేసింది. వివిధ రంగాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఆ సంస్థ సీఈఓ సచిన్ అలగ్ ఈ లెక్కలు వేశారు.

ఈ సుప్రసిద్ధ ఆధ్యాత్మిక కార్యక్రమంతో ఉత్తర్‌ప్రదేశ్‌లో ఆర్థికవృద్ధి, తాత్కాలిక ఉపాధి కల్పన జరుగుతుందని సచిన్ అభిప్రాయపడ్డారు. ఆ ప్రభావం పలు రంగాలపై కనిపిస్తుందన్నారు. ఒక్క పర్యాటక, ఆతిథ్య రంగాల్లోనే సుమారు 4.5 లక్షల మందికి ఉపాధి లభించొచ్చని అన్నారు. హెూటల్ స్టాఫ్, టూర్ గైడ్, పోర్టర్లు, ట్రావెల్ కన్సల్టెంట్లు, ఈవెంట్ కోఆర్డినేటర్లుగా పలువురికి పనిదొరుకుతుందని అన్నారు. ఇక రవాణా రంగంలో డ్రైవర్లు, సప్లై చైన్ మేనేజర్లు, ఇతర సేవలు అందించేందుకు 3 లక్షల మంది అవసరం ఉండొచ్చన్నారు. తాత్కాలిక వైద్య శిబిరాలతో 1.5 లక్షల మంది నర్సులు, పారామెడిక్స్, ఇతర వైద్య సిబ్బందికి అవకాశాలు దక్కుతాయని అన్నారు.

ముందడుగు
మంగళవారం
21-01-2025
హైదరాబాద్

# హారన్ మోత మోగించిన బస్సు డ్రైవర్లు..




ముందడుగు కర్ణాటక

ట్రాఫిక్‌లో వాహనాల హారన్ మోత ఎంత ఇరిటేట్ చేస్తుందో మాటల్లో చెప్పలేం. రోడ్డుపై వెళ్లే వారికి వాహనాల హారన్ మోత చికాకుతో పాటు ఇబ్బంది కలిగిస్తుంది. ఈ నేపథ్యంలో ఒక ట్రాఫిక్ పోలీస్ అధికారి దీనిపై సీరియస్‌గా స్పందించారు. అదే పనిగా హారన్ మోత మోగించిన డ్రైవర్లకు వినూత్నంగా శిక్ష విధించారు. వారి వాహనం నుంచి హారన్ మోగించి ఆ డ్రైవర్లు వినేలా చేశారు. కర్ణాటకలో ఈ సంఘటన జరిగింది. అదే పనిగా హారన్ మోగించే బస్సులను ఒక ట్రాఫిక్ పోలీస్ అధికారి నిలిపివేశారు. డ్రైవర్లను బస్సుల నుంచి కిందకు దిగమని చెప్పారు. ఆ బస్సులకు అమర్చిన హారన్ వద్ద డ్రైవర్లను మోకాళ్లపై కూర్చోబెట్టారు. వారి వాహనాల హారన్‌ను డ్రైవర్లకు వినిపించారు. హారన్ శబ్దం వారికి ఎంత చికాకు, ఇబ్బంది కలిగించిందో అడిగి తెలుసుకున్నారు. మిగతా వాహనదారులు, జనం కూడా అలాంటి ఇబ్బంది ఎదుర్కోవడాన్ని ప్రత్యక్షంగా వారికి చూపించారు. ఈ మేరకు వినూత్నంగా శిక్ష విధించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో ఆ ట్రాఫిక్ పోలీస్ అధికారి చర్యను నెటిజన్లు ప్రశంసించారు.

## నన్ను నేను చూసుకొని ఏడ్చేశా..

### రాంగోపాల్ వర్మ ఎమోషనల్

ఎప్పుడూ ఏదో ఒక హాట్ టాపిక్‌తో వార్తల్లో నిలుస్తుంటాడు రాంగోపాల్ వర్మ. అయితే ఈ డైరెక్టర్ ఎమోషనల్ అయిన సందర్భాన్ని మాత్రం చాలా అరుదుగా చూస్తుంటాం. తాజాగా వర్మ డైరెక్ట్ చేసిన సత్య రీరిలీజ్ అయిన క్షణాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యాడు. రాంగోపాల్ వర్మ కాంపౌండ్ నుంచి బ్లాక్ బస్టర్‌గా నిలిచిన సినిమాల్లో ఒకటి సత్య. జేడీ చక్రవర్తి, మనోజ్ బాజ్‌పేయి, ఊర్మిత మటోండ్కర్ లీడ్ రోల్స్‌లో నటించిన ఈ చిత్రం జనవరి 17న గ్రాండ్ రీరిలీజైంది. ఈ నేపథ్యంలో ఎక్స్ వేదికగా

రెండు రోజుల క్రితం సత్య సినిమా చూశా. 27 ఏండ్ల తర్వాత ఈ సినిమా చూస్తుంటూ కన్నీళ్లు ఆగలేవు. నా కన్నీళ్లు ఎవరైనా చూస్తారేమో అని కూడా పట్టించుకోకుండా ఏడ్చేశాను. సినిమా చూసి ఎమోషనల్ అవ్వలేదు. సత్య సినిమా తర్వాత నా ప్రయాణాన్ని గుర్తు చేసుకుని ఎమోషనల్ అయ్యానని ట్వీట్ చేశాడు వర్మ. ఒక సినిమా తీయడమంటే బిడ్డకు జన్మనివ్వడం లాంటిదే.

సినిమాను ముక్కలు ముక్కలుగా షూట్ చేస్తుంటాం. కాబట్టి ఫైనల్ అవుట్‌పుట్ ఎలా వస్తుందనేది తెలియదు. షూటింగ్ అయిపోయిన తర్వాత సినిమా చూసిన వాళ్లు దాన్ని హిట్టనో లేదా ఫట్టనో చెప్తుంటారు. కానీ నేను మాత్రం నేను సృష్టించిన సినిమా అందాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తా. ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచిన సత్యను లక్ష్యం లేని నా జర్నీలో ఒక అడుగుగా మాత్రమే భావించా. రెండు రోజుల వరకు కూడా అదే అభిప్రాయంతో ఉన్నా . నేను సినిమాలోని విషాదం చూసి చలించి పోలేదు. సినిమాలో నన్ను నేను చూసుకొని ఏడ్చేశానంటూ సుదీర్ఘ సందేశాన్ని ఎక్స్‌లో పోస్ట్ చేశాడు.



## సౌత్ ఇండియా ఉమెన్ ఇన్స్పిరేషన్ అవార్డ్ 2025 అందుకున్న కర్రె పావనిరవి




ముందడుగు హైదరాబాద్

సౌత్ ఇండియ ఉమెన్ ఇన్స్పిరేషన్ అవార్డు కార్యక్రమం హైదరాబాదులోని బాస్కర ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. శారద ఎడ్యుకేషనల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో మహిళలలో ఆదర్శంగా నిలిచిన వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ కి చెందిన ఆదరణ సేవా సమితి అధ్యక్షురాలు కర్రె పావని సినీ నటి కవిత చేతుల మీదుగా సౌత్ ఇండియా ఉమెన్ ఇన్స్పిరేషన్ అవార్డు 2025 అందుకున్నారు. ఈ సందర్భంగా కర్రె పావని మాట్లాడుతూ ఆడ వారంటే కేవలం వంట ఇంటి కుందేలు కాదని వారికీ సమాజం పట్ల బాధ్యత, గౌరవం ఉంటుందని సామాజిక కార్యకర్తలుగా ఎన్నో స్వచ్ఛంద కార్యక్రమాలు మరియు పోరాటాలు చేస్తూ మగవారికి దీటుగా సమాజాన్ని మేల్కొలుపుతున్నామని అందరికి ఆదర్శంగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. ఈ అవార్డు అందుకున్న కర్రె పావనిని కరీంనగర్ ప్రజలు అభినందించారు.